

పటేల్ కృషి మరువలేనిది

దేశ ఐక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి మరువలేనిదని అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు అన్నారు. 8లో



నేడు సింహగిరిపై నరకాసురవధ

సింహాచలం: నరక చతుర్దశి, దీపావళి పురస్కరించుకుని గురువారం సింహగిరిపై నరకాసురవధ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు దేవస్థానం వైదిక, అధికారులు ఏర్పాట్లు చేశారు. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.



పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు, పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

నూకాంబిక ఆలయంలో ధనలక్ష్మి పూజలు



నూకాంబిక అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

అనకాపల్లి: ధనత్రయోదశి సందర్భంగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో బుధవారం మహిళలు ధనలక్ష్మి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.సుజాత, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధుడు

- పోక్సో కేసు నమోదు

అనకాపల్లి: పన్నెండేళ్ల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వృద్ధుడు యల్లపు శ్రీరామ్మూర్తి(65)పై పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ బుధవారం పోక్సోకేసు నమోదు చేశారు. సీఐ కథనం మేరకు వివరాలు.. బాధిత బాలిక తల్లిదండ్రులు మరణించడంతో గవరపాలెం, సంతోషిమాత ఆలయ రహదారి సమీపంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. అమ్మమ్మ కూలిపనులు చేసుకుంటూ పాపను పోషిస్తోంది. ఇంటికి సమీపంలో ఉన్న నిందితుడు శ్రీరామ్మూర్తి మంగళవారం రాత్రి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక అమ్మమ్మ సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కోడూరు లేఅవుట్‌లో 196 ఏపీఐఐసీ ప్లాట్లు

- ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకునే వెసులుబాటు

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి మండలం కోడూరులో ఏపీఐఐసీ ఇండస్ట్రీయల్ పార్కులో ఆన్‌లైన్‌లో ప్లాట్‌లు బుక్‌చేసుకునే సదుపాయం కల్పించారు. ఈమేరకు ఏపీఐఐసీ బుధవారం తమ అఫీషియల్ వెబ్‌సైట్‌లో ఖాళీలను ప్రకటించింది. ఆన్‌లైన్‌లో 196 ప్లాట్లను అందుబాటులో ఉంచారు. వీటిలో జనరల్ కేటగిరి 139, ఎస్సీ,ఎస్టీ కేటగిరిలో 57 ప్లాట్లు అందుబాటులో ఉంచారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఐఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడమే కాకుండా పారిశ్రామికవేత్తలకు అవకాశాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్టు ఏపీఐఐసీ ప్రకటనలో తెలిపింది.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

అనకాపల్లి: కార్తీకమాసం సందర్భంగా వచ్చేనెల 3,10,17,24 తేదీల్లో అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ప్రజా రవాణాశాఖ(ఆర్టీసీ) అధికారి కె.పద్మావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలకు అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక బస్సులు బయలుదేరి, సోమవారం రాత్రి తిరిగి డిపోలకు చేరుకుంటాయని పేర్కొన్నారు. అనకాపల్లి డిపో నుంచి పంచారామాల దర్శనానికి పల్లె వెలుగు బస్సుకు ఒక్కొక్కరికీ రూ.1,100, ఎక్స్‌ప్రెస్‌లకు ఒక్కొక్కరికీ రూ.1,200, నర్సీపట్నం డిపో నుంచి పల్లె వెలుగు బస్సుకు ఒక్కొక్కరికీ రూ.900, అల్ట్రాపల్లె వెలుగు బస్సులకు ఒక్కొక్కరికీ రూ.1,080, ఎక్స్‌ప్రెస్‌లకు ఒక్కొక్కరికీ రూ.1,200, అల్ట్రా డీలక్స్ బస్సుకు ఒక్కొక్కరికీ రూ.1,450 చొప్పున ఛార్జీలు వసూలు చేయనున్నట్టు తెలిపారు. ముందుగా టికెట్లు బుక్‌చేసుకునే భక్తులు అనకాపల్లి డిపో (సెల్‌నంబర్ 7382913967), నర్సీపట్నం డిపో (సెల్ నంబర్ 9494811855)లలో సంప్రదించాలని కోరారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.70 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీ ఆదాయం 30 రోజులకు గానూ రూ.1,70,22,443 వచ్చినట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై యాత్రికాసదన్‌లో గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.1,63,37,000 కరెన్సీ నోట్ల రూపంలో, రూ.6,85,443 చిల్లర నాణేల రూపంలో కలిపి మొత్తం రూ.1,70,22,443 వచ్చినట్టు ఈవో వెల్లడించారు. అలాగే 57.900 గ్రాముల బంగారం, 10కిలోల 130 గ్రాముల 500 మిల్లీగ్రాముల వెండి లభించిందన్నారు. లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక దీపం



దీపావళిని పర్యావరణహితంగా జరుపుకోవాలని గుడివాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరి కోరారు.పాఠశాలలో బుధవారం విద్యార్థులు పుస్తకాలను ప్రమిద, జ్యోతి రూపంలో అమర్చి, దాని చుట్టూ కూర్చొని స్థానికులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాలక్ష్మి, శ్రీదేవి,భవాని తదితరులు పాల్గొన్నారు. -ఎస్.రాయవరం

కొంగొత్త రూపం

సమ్‌థింగ్ స్పెషల్











మార్కెట్‌లో దీపావళి సందర్భంగా వివిధ దీపాల ఆకృతుల్లో విద్యుత్ లైట్లతో పాటు, మట్టి ప్రమిదలు సందడి చేశాయి. కొంగొత్త రూపాల్లో కొనుగోలుదారులను ఆకట్టుకున్నాయి. నీళ్లతో వెలిగే విద్యుత్ దీపాలు, విద్యుత్ దీపాల తోరణాలు, కొవ్వొత్తుల ఆకారంలో ఇలా వివిధ ఆకృతుల్లో రంగురంగుల కాంతులను విరజిమ్ముతూ ఆకర్షిస్తున్నాయి. మట్టి ప్రమిదలు కూడా కొత్తకొత్త రూపాలతో మార్కెట్‌ను ముంచెత్తాయి. తులసికోటతో పాటు వివిధ ఆకృతుల్లో ఉన్నవాటిని విక్రయిస్తున్నారు. గాలికి దీపాలు ఆరిపోకుండా ఉండేందుకు కొన్ని ప్రమిదలకు ప్రత్యేకంగా చిమ్నీలు అమర్చి అమ్ముతున్నారు. - అనకాపల్లి/యలమంచిలి రూరల్

నరకాసుర దహనం...
మిన్నంటిన సంబరం



స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం



నరకాసుర గడ్డిబొమ్మను దహనం చేస్తున్న అర్చకుడు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం, టీటీడీ అనుబంధ దేవాలయం ఉపమాక వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం నరకాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు భారీగా తరలివచ్చి ఈ ఘట్టాన్ని తిలకించారు. ముందుగా ఉదయం స్వామివారి మూలవిరాట్ సన్నిధిలో నిత్యాభిషేకాలు, అర్చనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తులు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామివారి సన్నిధిలో నిత్యపూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. నరక చతుర్దశి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారిని రాజాధిరాజ వాహనంలో వేంచేయింపు జేసి ఉపమాక వీధుల్లో ఊరేగించారు.నరకాసురుని గడ్డిబొమ్మతయారు చేసి ఉపమాక వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ రాజగోపురం ఎదురుగా ఆ గడ్డిబొమ్మను దహనం చేసినట్టు ప్రధానార్చకులు వరప్రసాద్ తెలిపారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి ఏటా నరకచతుర్దశి, నరకాసురుని వధ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, సంకర్షణ పల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, సాయి ఆచార్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంచరాత్రి ఉత్సవాలు

- ఏటా దీపావళి నుంచి నాగుల చవితి వరకు సంబరాలు
- ఉత్సవాల పోస్టర్ విడుదల చేసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి



పంచరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి,కమిటీల సభ్యులు

యలమంచిలి రూరల్: జిల్లాలో ప్రసిద్ధి చెందిన యలమంచిలి పంచరాత్రి ఉత్సవాలకు భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి.ప్రతి ఏటా దీపావళి నుంచి నాగులచవితి వరకు ఐదు రాత్రులు పట్టణంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల కోసం పట్టణంలో సుబ్రహ్మణ్యస్వామి,భూలోకమాంబ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.గురువారం రాత్రి నుంచి నాగుల చవితి రోజు వరకు ఐదు రాత్రులు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.చివరి రోజు రాత్రి ఉత్సవాలను తిలకించడానికి భారీ ఎత్తున భక్తులు తరలివస్తారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఈ సారి వారిని మరింతగా ఆకర్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తులసీనగర్,పాతవీధి అంతర్గత రహదారులతో పాటు పట్టణంలోని ప్రధాన రహదారిపై భారీ సెట్టింగ్‌లు,విద్యుత్ దీపాలంకరణల ఏర్పాటుకోసం రెండు వారాలుగా పనులు జరుగుతున్నాయి.దీపావళి రోజు ఉదయం ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించిన తర్వాత రాత్రి నుంచి ఉత్సవాల వైభవంగా ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీల నిర్వాహకులు తెలిపారు. దీపావళి రోజున లక్ష ఒత్తులతో దీపాలంకరణతో పాటు ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు,సంప్రదాయ నృత్యప్రదర్శనలు నిర్వహించనున్నారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పంచరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి,రెండు కమిటీల సభ్యులు బుధవారం యలమంచిలి తులసీనగర్‌లో ఛైర్‌పర్సన్ ఇంటివద్ద ఆవిష్కరించారు.ఈ సారి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి తాము చేస్తున్న ఏర్పాట్ల గురించి ఛైర్‌పర్సన్ రమాకుమారి మీడియాకు వివరించారు. ఉత్సవాలను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భూలోకమాంబ, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ కమిటీల సభ్యులు ఆడారి శ్రీధర్(చిన్నా),పిల్లా రామకృష్ణ,మళ్ల కొండబాబు,ఆడారి పూరీ జగన్నాథం,పైడికొండ, కర్రి జానకీరాం,అశోక్,నాయుడు,ఇతర సభ్యులు పాల్గొన్నారు.



దివ్యకాంతుల దీపావళి

దీపావళి వేడుకలకు జిల్లా ముస్తాబైంది. పూలు, పూజాసామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. స్వీట్లు, బాణసంచా దుకాణాలు కిటకిటలాడాయి. వ్యాపార సముదాయాల్లో లక్ష్మీదేవి పూజకు సర్వం సిద్ధం చేసుకున్నారు. మార్కెట్‌లో వివిధ ఆకృతుల్లో దీపాలు, లక్ష్మీదేవి ప్రతిమలు విక్రయిస్తున్నారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. అయితే దీపావళిని అప్రమత్తంగా జరుపుకోవాలని, అప్పుడే ఆనంద కాంతులు వెల్లివిరుస్తాయని వైద్యులు, అధికారులు సూచించారు.



బాణసంచా దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన ఫైర్ అవుట్ పోస్టు

- అప్రమత్తతతోనే ఆనంద కాంతులు
- హరిత టపాసులతో పర్యావరణానికి మేలు
- జిల్లా వ్యాప్తంగా 271 స్టాళ్లకు అనుమతి
- జీవీఎంసీ పరిధిలో 40, రూరల్ జిల్లా పరిధిలో 231
- షాపుల వద్ద ఫైర్ అవుట్‌పోస్టుల ఏర్పాటు

సాక్షి, అనకాపల్లి : జిల్లా వ్యాప్తంగా ఊరూవాడా వెలుగులు దీపావళి సందడి మొదలైంది. హోల్‌సేల్ దుకాణాలు రెండు రోజులుగా కిటకిటలాడుతున్నా యి. పర్యావరణ హిత పద్ధతుల్లో హరిత టపాసులతో ఆనందంగా దీపావళి జరుపుకోవాలని పర్యావరణ శాస్త్రవేత్తలు, వైద్యులు సూచించారు. జిల్లాలో ప్రధాన పట్టణాలైన అనకాపల్లి టౌన్, చోడవరం, నర్సీపట్నం, యలమంచిలి, పాయకరావుపేట, సబ్బవరాలలో బుధవారం నుంచి స్టాళ్ల ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించారు. స్టాళ్ల వద్ద ఫైర్ అవుట్‌పోస్టులను, ఫైర్ ఇంజన్‌లను ఏర్పాటుచేశారు. గత ఏడాదితో పోల్చితే బాణాసంచా విక్రయాలుతగ్గినప్పటికీ... కొనుగోలుదారులు బారులు తీరుతున్నారు. స్టాళ్ల అనుమతికి కూడా ఈ ఏడాది తక్కువగానే దరఖాస్తులు వచ్చాయి. బాణసంచా ధరలు 20 శాతం పెరగడంతో 40 శాతం విక్రయా లు తగ్గాయని హోల్‌సేల్ వ్యాపారస్తులు తెలిపారు.

హరిత టపాసులతో పర్యావరణానికి మేలు..

పర్యావరణానికి పెద్దగా హాని చేయని, తక్కువ కాలుష్యం వచ్చే హరిత టపాసుల(గ్రీన్ క్రాకర్స్)నే వినియోగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇందులో భాగంగానే ఏపీ కాలుష్య నియంత్రణ మండలి(ఏపీ పీసీబీ) అధికారులు హరిత టపాసుల వినియోగంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మరో వైపు రెవెన్యూ, పోలీసు, ఫైర్ విభాగాల అధికారులు ముందస్తు జాగ్రత్తలతో స్టాళ్ల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. ప్రతి దుకాణానికి మధ్య 3 మీటర్ల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. పొరపాటున అగ్ని ప్రమా దం సంభవించినా.. పక్కదుకాణానికి చేరకుండా.. ముందస్తుగానే మంటల్ని అదుపు చేసేలా ఇసుక, నీళ్ల తదితర ఏర్పాట్లు చేసుకోవాలని స్టాళ్ల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

అత్యవసర సమయాల్లో ఫోన్ చేయాల్సిన ఫైర్‌స్టేషన్ల నంబర్లు ...

అనకాపల్లి	9963728723
యలమంచిలి	9963728947
నర్సీపట్నం	9963728766
మాడుగుల	9963729442
చోడవరం	9963729097
సబ్బవరం	9963729473

షాపుల వివరాలు...

జీవీఎంసీ పరిధిలో ఉన్న అనకాపల్లి టౌన్‌లో ఎన్టీఆర్ క్రీడామైదానంలో 40 స్టాళ్లకు, రింగ్‌రోడ్డు బెల్లం మార్కెట్‌లో 6 స్టాళ్లకు అనుమతి ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలో ఆరు ఫైర్ స్టేషన్ల పరిధిలో మొత్తం 231 స్టాళ్లకు అనుమతి ఇచ్చారు.

ఫైర్ అవుట్ పోస్టుల ఏర్పాటు



అనుమతి లేకుండా క్రాకర్స్‌ని అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. బాల్కనీ, టెర్రస్‌లపై బాణసంచా కాల్చొద్దు. ప్రమాదాలు జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 101 కాల్‌చేసి అక్కడ అడ్రస్, లాండ్‌మార్క్ చెబితే త్వరగా రాగలుగుతాం. క్రాకర్స్ విక్రయించే దుకాణాల మధ్య దూరం 3 మీటర్ల ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. క్రాకర్స్‌ను కొనేటప్పుడు క్యూ పద్ధతిలో వెళ్లడం మంచిది. ఈ ఏడాది స్టాళ్ల ఏర్పాటు చేసే చోట ఫైర్ అవుట్‌పోస్టులను ఏర్పాటుచేశాం. అదేవిధంగా స్టాళ్లు ఎక్కువగా ఉండే చోట మినిమమ్ ఛార్జీలు చెల్లిస్తే.. ఒక ఫైర్ ఇంజిన్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

-ఆర్.వెంకట రమణ, జిల్లా ఫైర్ ఆఫీసర్.

కాలిన గాయాలపై పేస్ట్ పూయొద్దు..



క్రాకర్స్ వల్ల కాలిన గాయాలైతే ఐస్ నీరు, సిరా, ఐస్ ముక్కలతో రుద్ద వద్దు. ఆయింట్‌మెంట్, టూత్ పేస్ట్, పసర్లు, పసుపు వంటివి పూయకూడదు. జనరల్ ట్యాప్ వాటర్‌నే వేయాలి. బట్టలకు మంటలు అంటుకున్నప్పుడు కంగారుపడి పరిగెత్తకూడదు. పడుకుని దొర్లడం వల్ల మంటలు ఆరిపోతాయి. వెంటనే గాయాలపై నీళ్ల పోయాలి. గాయాన్ని శుభ్రమైన వస్త్రంతో కప్పి వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. బాణసంచా వెలిగించేటప్పుడు వీలైనంత వరకు కాటన్ దుస్తులు వేసుకోవడం మంచిది.

– డాక్టర్ సుధాకర్, ఎన్ఆర్ఐ డీన్, విశ్రాంతి ఎఎంసీ ప్రిన్సిపాల్

గంజాయి రవాణాకు అడ్డుకట్ట

- డీఐజీ గోపీనాథ్ జెట్టి
- మాకవరపాలెం, రోలుగుంట పోలీస్‌స్టేషన్ల తనిఖీ



రోలుగుంటలో రికార్డులను పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

మాకవరపాలెం/రోలుగుంట: గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు డైనమిక్, స్టాటిక్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, విస్తృతంగా తనిఖీలను నిర్వహిస్తున్నట్టు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం మాకవరపాలెం, రోలుగుంట పోలీస్ స్టేషన్లను అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్‌తో కలిసి డీఐజీ గోపీనాథ్ జెట్టి సందర్శించారు. రోలుగుంటలో అనకాపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ బి.అప్పారావు, కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.కోటేశ్వరరావు, రోలుగుంట ఎస్ఐ పి.రామకృష్ణరావు పూల మొక్కలను అందజేసి వారికి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోపీనాథ్ జెట్టి రెండు స్టేషన్లలో రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. మూడేళ్లగా పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి ప్రస్తుత దర్యాప్తు స్థాయిని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు,దొంగతనాలు, చీటింగ్ ఇతర కేసుల ఫైళ్లను పరిశీలించి, కేసుల దర్యాప్తు జరుగుతున్న విధానం, పురోగతి గూర్చి ఆరా తీశారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని, తప్పించుకుని తిరుగుతున్న నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో కీలక నిందితులను అరెస్టు చేసే విధంగా దిశానిర్దేశం చేశారు. మత్తు పదార్థాలు వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వాట్స్ అప్ గ్రూప్ ద్వారా కూడా వారికి సమాచారంచేరేలా చర్యలుచేపట్టాలనిఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండేలా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి, వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా మహిళల భద్రతకు పెద్దపీట వేయాలని, పోలీస్ శాఖ అండగా ఉందని వారికి భరోసా కల్పించాలని, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. నర్సీపట్నం సబ్‌డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, డీఎస్పీ కుమార్, నర్సీపట్నం రూరల్, టౌన్ సీఐలు రేవతమ్మ, గోవిందరావు, ఎస్ఐ దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఐజీ గోపానాథ్ జెట్టి సూచించారు. మాకవరపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సైబర్ మోసగాళ్లు కొత్తకొత్త పంథాలను అవలంభిస్తున్నారని చెప్పారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని. ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని తెలిపారు. మీకు పార్సిల్ వచ్చిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయని బెదిరిస్తూ కొందరు నగదు డిమాండ్ చేస్తున్నారన్నారు. డాక్టర్లు, అధిక మొత్తంలో నగదు లావాదేవీలు చేస్తున్న వారిని టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. కొత్త వ్యక్తులు, తెలియని నంబర్ నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌పై సమీప పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. లేకుంటే 1930 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని చెప్పారు.

కేసులు పెట్టినా తగ్గేదేలే

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



ఎఫ్ఐఆర్ కాపీని చూపుతున్న ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ఇసుక దోపిడీని కప్పిపుచ్చుకునేందుకు స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు ప్రొద్బలంతో రూరల్ సీఐ రేవతమ్మ వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసుపెట్టారని, కేసులకు భయపడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక దోపిడీ నుంచి బయటపడేందుకు తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకురాలిలా రూరల్ సీఐ వ్యవహరిస్తున్నారని, స్పీకర్ చెబితే తప్పుడు కేసులు పెడుతున్నారని చెప్పారు. ఇదే విధంగా వ్యవహరిస్తే సీఐపై కోర్టును ఆశ్రయించడంతో పాటు సర్కిల్ స్టేషన్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈనెల 25వ తేదీ రాత్రి గబ్బాడ ఇసుక స్టాక్ పాయింట్‌లో అనుమతి లేకుండా రెండు లారీల్లో ఇసుక లోడుచేస్తున్నారన్న సమాచారం మేరకు మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, లీగల్‌సెల్ ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర వెళ్లారని, వీరిని చూసి స్టాక్ పాయింట్ వద్ద ఉన్న టీడీపీ నాయకులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారని చెప్పారు. ఈ విషయమై పార్టీ నాయకులతో కలిసి 26న తాను రూరల్ సీఐ రేవతమ్మకు ఫిర్యాదు చేశానన్నారు. ఇసుక దోపిడీ నుంచి బయటపడేందుకు స్పీకర్ ఆదేశాలతో... వైఎస్సార్‌సీపీ నాయకులు చంపేస్తామని బెదిరించడంతోపరుగులు తీశానని 27వతేదీ మధ్యాహ్నం వీఆర్వోపోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. యార్డులో ఉన్నవి వీఆర్వో ట్రాక్టర్లు అంటున్నారని, అయితే 6 గంటలకే యార్డుకు వచ్చి రెండు లారీలను బయటకు పంపించేశామని మరో వైపు తహసీల్దార్ చెప్తున్నారని తెలిపారు.అధికారుల మాటల మధ్య పొంతనలేదన్నారు. ఈవిషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేమన్నారు. తప్పుడు ఫిర్యాదు చేసిన వీఆర్వో, తప్పుడు కేసులు పెట్టించిన అధికారులపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, టౌన్ అధ్యక్షులు ఏకా శివ, పార్టీ లీగల్‌సెల్ ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర, కౌన్సిలర్లు బయపురెడ్డి చినబాబు, సిరసపల్లి నాని పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధి నిర్వహణలో అంకిత భావంతోనే గుర్తింపు



పదవీ విరమణ చేస్తున్న ఎస్ఐలను సత్కరిస్తున్న ఏఎస్పీ ఎల్.మోహనరావు

అనకాపల్లి: పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వహించిన ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందని అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో బుధవారం పదవీ విరమణ చేస్తున్న ఎస్ఐలు ఎం.రాజశేఖర్‌రాజు, వి.సోమలింగం, సిహెచ్.మల్లేశ్వరరావు, ఏఎస్ఐ మహమ్మద్ సిరాజుల్ హక్, హెచ్‌సీ ఎం.రామారావును ఆయన సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంలోనే సాధ్యమవుతుందన్నారు. అలాంటి ఉద్యోగం చేయడం మన అందరి అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, టి.లక్ష్మి, గఫూర్, రమేష్, రామకృష్ణారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నక్క దాడిలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న కొండబాబు

గొలుగొండ: ఏఎల్‌పురం ఆస్పత్రి సమీపంలో బుధవారం రోడ్డుపై నడిచి వెళుతున్న ఇద్దరు వ్యక్తులపై నక్క దాడి చేసి గాయపరిచింది. ఏఎల్ పురానికి చెందిన లగుడు కొండబాబు, మాకిరెడ్డి రాము పొలానికి వెళుతున్న సమయంలో తుప్పల్లో ఉన్న నక్క ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచింది. వెంటనే ఇద్దరు స్థానికంగా ఉన్న ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందారు. గత 20 రోజుల్లో ఈ నక్క 8 మందిని గాయపరిచింది. నక్కను పట్టుకుని తమను రక్షించాలని పంచాయతీ అధికారులకు ప్రజలు బుధవారం ఫిర్యాదు చేశారు.

ఆనందంగా దీపావళి.. కాస్త జాగ్రత్తగా..!

- ప్రమోదం.. కాకూడదు ప్రమాదం
- కాలుష్యం నుంచి మాస్క్‌లతో రక్ష
- వెలుగుల పండక్కి నగరం సిద్ధం



మహారాణిపేట:

దీపావళి పండగను జరుపుకునేందుకు నగరం సిద్ధమైంది. దీపావళి అంటే ప్రతీ మదిలో మెదిలేది టపాసులు.. క్రాకర్స్.. చిచ్చుబుడ్డి వెలుగులు. గతంలో పిండి వంటలు చేసుకుని.. మట్టి దీపాలతో దివిటీలు తిప్పుడూ పండగ జరుపుకునే వారు. ఇవి ప్రకృతికి పెద్దగా నష్టం కలిగించేవి కాదు. నేటి మన జీవన విధానం పండగ చేసుకునే తీరు ప్రకృతి వనరులు, చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నో జాగ్రత్తలతో పండగ జరుపుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వాయు కాలుష్యం హృదయ, శ్వాసకోశ వ్యాధులను తీవ్రతరం చేస్తుంది. గుండె, ఊపిరితిత్తులపై ప్రభావితం చూపుతుంది. గుండెపోటుకు దారి తీసే అవకాశం ఉంది. అందుకే ముందు జాగ్రత్తగా దీపావళి రోజు మాస్క్‌లు ధరించి టపాసులు కాల్చాలని వైద్యులు సూచిస్తున్నారు. పర్యావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకున్న కొన్ని సంస్థలు యాంటీ పొల్యూషన్ మాస్క్‌లను విరివిగా విక్రయిస్తున్నాయి.

టపాసులు కాల్చేటప్పుడు..

బాణసంచా కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా పెను ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. అవి మిగిల్చిన చేదు జ్ఞాపకాలు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. వినియోగదారులు నాణ్యమైన పటాసులు మాత్రమే కొనుగోలు చేయాలి. ఆయిల్ క్యాన్లు, గ్యాస్ సిలిండర్లు, తదితర మండే పదార్థాలకు దూరంగా టపాసులు కాల్చాలి. పైకి ఎగిరే తారాజువ్వలను గడ్డికుప్పలు, పూరి గుడిసెలకు దూరంగా కాల్చాలి.

పెద్దల పర్యవేక్షణలో పిల్లలు బాణసంచా కాల్చడం ఉత్తమం. సరిగ్గా కాలని వాటిని మళ్లీ వెలిగించడం, ఊదడం చేయకూడదు. తక్కువ శబ్దం వచ్చే వాటిని ఎంచుకోవాలి. పేలుడు పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలి. కాల్చేటప్పుడు నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. చేతిలో టపాసులు కాల్చడం, వెలిగించి విసిరి వేయడం వంటివి చేయకూడదు.

అత్యవసర నంబర్లు

108	అగ్నిప్రమాదంలో ఎవరైనా గాయపడితే వెంటనే 108కు ఫోన్ చేయాలి.
101:	అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించాలి.
100, 112 :	అత్యవసర సమాచారం ఏదైనా ఈ నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలి.

ఎవరూ గాయాలపాలు కావద్దు



టపాసులు కాల్చే సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గాయాలపాలవుతాం. ఆ సమయంలో త్వరగా మండే స్వభావం ఉన్న సింథటిక్ దుస్తులు కాకుండా.. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం మంచిది. టపాసులు, చిచ్చుబుడ్లు వెలిగించిన తర్వాత అవి సరిగా కాలుతున్నాయో లేదో అని దగ్గరగా వెళ్లి చూస్తుంటారు. ఒకవేళ ఆ టపాసులు పేలితో ముఖానికి, కళ్లకు తీవ్ర గాయాలై.. కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అలా ఎవరూ చేయవద్దు. టపాసులు కాల్చే సమయంలో కళ్ల జోడు ధరించడం మంచిది. కాళ్లకు చెప్పులు లేదా షూ వేసుకోవాలి. ఏటా దీపావళి అనంతరం కేజీహెచ్‌కు 15 నుంచి 20 మంది గాయాలతో వస్తుంటారు. తగిన జాగ్రత్తలు తీసుకుని.. ఎవరూ గాయాలపాలు కావద్దు.

–డాక్టర్ టి.మోహనరావు, ప్లాస్టిక్ సర్జరీ విభాగం, కేజీహెచ్

రాష్ట్ర స్థాయి పోటీలకు బుచ్చింపేట విద్యార్థి



విద్యార్థి వంశీతో పీడీ కొండలరావు

రోలుగుంట: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు బుచ్చింపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఆడి వంశీ ఎంపికయ్యాడు. అచ్యుతాపురం మండలం హరిపాలెంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలు ఈ నెల 29న జరిగాయి. ఈ పోటీల్లో విజయం సాధించిన వంశీ రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. ఈ మేరకు వంశీని హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయడు కొండలరావు అభినందిచారు.

గంటికొర్లాం పంచాయతీ నిధులు పక్కదారి!



గంటికొర్లాం పంచాయతీ

బుచ్చెయ్యపేట: మండలంలోని గంటికొర్లాం పంచాయతీ నిధులు దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా విచారణ చేపట్టకపోవడంపై పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పనులు చేపట్టకుండా పంచాయతీ నిధులు డ్రా చేయడంపై పంచాయితీ బోర్డు సభ్యులు ఈ నెల 28న కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. మూడేళ్లుగా పంచాయతీ బోర్డు సమావేశాలు నిర్వహించకుండా, తీర్మానాలు చేయకుండా సాధారణ నిధులతో పాటు 14, 15 ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.11 లక్షల వరకు డ్రా చేసి దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 90 ఏళ్ల వయస్సు పైబడిన సర్పంచ్ శరకాన గౌరమ్మకు తెలియకుండానే ఆమె కుమారుడు బాబూరావు ఆమె వేలిముద్రలు వేసి పంచాయతీ నిధులు డ్రా చేసి దుర్వినియోగం చేశాడని మాజీ సర్పంచ్, ప్రస్తుత ఉప సర్పంచ్ శనివాడ రాజారావు, పంచాయతీ వార్డు మెంబర్లు ఆరోపిస్తున్నారు. పంచాయతీలో విచారణ చేపట్టకుండా ఈవోపీఆర్డీ సర్పంచ్ ఇంటికొచ్చి రికార్డులను తారుమారు చేయడానికి ప్రయత్నిస్తున్నారని రాజారావు విమర్శించారు. నిధులు దుర్వినియోగంపై బుధవారం జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణిని కలిసి మరోసారి ఫిర్యాదు చేశారు. నిధులు దుర్వినియోగంపై విచారణ చేయించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని మాజీ సర్పంచ్ తెలిపారు.



ముగిసిన పోలీస్ అమరవీరుల వారోత్సవాలు



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

అనకాపల్లి: పోలీస్ అమరవీరుల వారోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక రింగ్‌రోడ్డు జంక్షన్ నుంచి పెరుగుబజార్ జంక్షన్ వరకూ బుధవారం పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బి.అప్పారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరవీరులైన పోలీసుల సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా అమరవీరుల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐలు టి.వి.విజయకుమార్, ఎం.వెంకట నారాయణ, రూరల్ సీఐ అశోక్‌కుమార్, చోడవరం సీఐ అప్పలరాజు, ఎస్ఐలు డి.శేఖరం, అల్లు వెంకటేశ్వరరావు, డి.ఈశ్వరరావు, వి.సత్యనారాయణ, ఏఎస్ఐ మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు



నిందితులు, స్కూటీతో ఎస్ఐ మల్లేశ్వరరావు, సిబ్బంది

దేవరాపల్లి: ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని బుధవారం అరెస్టు చేసినట్టు దేవరాపల్లి ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు మండలంలోని శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. స్కూటీపై వస్తున్న ఇద్దరిని తనిఖీ చేయగా, వారి వద్ద మూడు కిలోల గంజాయి బయటపడినట్టు ఆయన తెలిపారు. సింహాచలానికి చెందిన కోన సంతోష్, కొయ్యూరుకు చెందిన కుప్ప తేజ అనే నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయితో పాటు స్కూటీని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు.

జిల్లా స్థాయి త్రోబాల్ పోటీకి ఎంపిక

కోటవురట్ల: కొంకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన రెడ్డి పుష్ప జిల్లా స్థాయి త్రోబాల్ పోటీకి ఎంపికయ్యారు. హరిపాలెం హైస్కూల్‌లో జరిగిన పోటీలో ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.ఎస్ స్వర్ణకుమారి తెలిపారు. పుష్పను ఆమెతో పాటు పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కన్నంపేట రైస్ మిల్లులో చోరీ

చోడవరం : కన్నంపేటలోని రైస్ మిల్లులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రైస్ మిల్లు తాళాలు విరగొట్టి రూ.70వేలు విలువ చేసే విద్యుత్ మోటార్‌ను దొంగలు ఎత్తుకుపోయినట్లు నిర్వాహకుడు గుమ్మడు వెంకటేశ్వరరావు బుధవారం కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


విద్యార్థిని చదువుకు సాయం



డాక్టర్ కిల్లాడ సత్యనారాయణ

నర్సీపట్నం: తెలంగాణకు చెందిన ఓ విద్యార్థిని చదువుకు నర్సీపట్నంలోని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణుడు కిల్లాడ సత్యనారాయణ సాయమందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తెలంగాణకు చెందిన విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు వచ్చినా పేదరికం కారణంగా ఇబ్బంది పడుతున్నట్టు సాక్షి దినపత్రికలో ఇటీవల మానవీయ కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన సత్యనారాయణ విద్యార్థినికి ఫోన్ చేసి మాట్లాడారు. తన వంతు కొంత ఆర్థిక సహాయంగా రూ.10వేలు ఫోన్‌పే ద్వారా పంపించారు. భవిష్యత్‌లో మరింత సహాయాన్ని చేస్తానని విద్యార్థినికి భరోసా ఇచ్చారు.

నివాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటుపై ఆందోళన



నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దని చెబుతున్న మహిళలు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళలు బుధవారం ఆందోళన చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. షాపు వద్దకు మహిళలు వచ్చి సిబ్బందిని నిలదీశారు. మద్యం దుకాణం గ్రామానికి శివారులో పెట్టుకోవాలి తప్ప ఇళ్ల మధ్య ఏమిటని ప్రశ్నించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎక్సైజ్ అధికారులు మధ్యాహ్నం షాపును పరిశీలించారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే సహించేది లేదని స్థానిక మహిళలు అధికారులకు తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దీంతో మహిళలు తాత్కాలికంగా శాంతించారు.

దేశ ఐక్యతకు పటేల్ కృషి మరువలేనిది



జాతీయ జెండా చేత పట్టి రన్నింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

అనకాపల్లి: దేశ ఐక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి మరువలేనిదని అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు జంక్షన్‌లో బుధవారం రాష్ట్రీయ ఏక్తా దివస్ (రన్ ఫర్ యూనిటీ)ను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ స్వదేశీ సంస్థానాలను భారత యూనియన్‌లో కలిపిన ఘనత పటేల్‌కే దక్కుతుందన్నారు. రింగ్ రోడ్డులో మొదలైన రన్నింగ్ రైల్వే స్టేషన్ మీదుగా స్థానిక నెహ్రూ చౌక్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, పట్టణ సీఐలు టీవీ విజయ్‌కుమార్, ఎం.వెంకటనారాయణ, ఏఆర్ సీఐ ఎల్.మన్మథరావు, సీహెచ్.సంజీవరావు, ఎస్ఐలు సత్యనారాయణ, డి.శేఖరం, డి.ఈశ్వరరావు, మహ్మద్ అలీ షరీఫ్, అల్లు వెంకటేశ్వరావు, ఆదినారాయణ, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు హరిపాలెం విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హరిపాలెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

అచ్యుతాపురం: రాష్ట్ర స్థాయి త్రో బాల్, ఖోఖో పోటీలకు అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో త్రోబాల్ పోటీలకు ఎంపికైన భాగ్యరాజ్,జాహ్నవి,సాయి అప్పారావు, యమున,కల్యాణి, ఖోఖో పోటీలకు ఎంపికైన భాను తేజాను పాఠశాల హెచ్‌ఎం శ్రీపాద రవి, పీఈటీ ధర్మిరెడ్డి రాజు, పాఠశాల కమిటీ చైర్మన్ తంగేటి సత్యనారాయణ, ఉపాధ్యాయులు కె.ఆర్.ఆర్.కుమార్, ఎం.జె.పట్నాయక్,గాంధీ,బాష,హైమావతి,అమ్మాజీ,రమణి,అనురాధ,సరస్వతి బుధవారం అభినందించారు.

ప్రణాళికతో లక్ష్యాలను చేరుకోవాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కె.సునీల్ ఇమ్మానుయేల్

పాయకరావుపేట: ప్రతి ఒక్కరూ ప్రణాళికలు రూపొందించుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ డైరెక్టర్(ఎన్ఐఎస్ఏ, హైదరాబాద్) కె.సునీల్ ఇమ్మాన్యుయేల్ సూచించారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు బయటకు వచ్చి సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అడ్డంకులపై కాకుండా లక్ష్యంపై దృష్టి పెట్టాలని చెప్పారు. విద్యార్థులకు జీవితంలో మొదటగా కఠోర శ్రమ, రెండోది దెబ్బ తగిలినా లేచి నిలబడేందుకు ప్రయత్నించే గుణం, చివరిగా లక్ష్యంపై నిబద్ధత ఉండాలని సూచించారు. పుస్తకాలు చదవడం, వార్తా పత్రికల్లో ఎడిటోరియల్ కాలం చదివి వాటిపై రివ్యూ రాయడం నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, సీబీఎస్ఈ వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

అభిజిత్ కార్మికుల వినూత్న నిరసన



ఎండుగడ్డి,ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న అభిజిత్ కార్మికులు

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల లే–ఆఫ్ ప్రకటించిన అభిజిత్ పరిశ్రమను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం వినూత్న నిరసన తెలిపారు. కార్మికులు ఎండు గడ్డి, ఆకులు తింటూ కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ అభిజిత్ కంపెనీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, కార్మిక చట్టాలను ఉల్లంఘించి లే ఆఫ్ ప్రకటించిందని ఆరోపించారు. కార్మికులకు వేతనాలు, బోనస్ లేకపోవడంతో దీపావళికి పస్తులు ఉండాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండు గడ్డి, ఆకులు తిని బతకాల్సి వచ్చిందని వాపోయారు. రోడ్డున పడిన 1000 మంది కార్మికులకు తక్షణమే బకాయిలు చెల్లించి, కర్మాగారాన్ని తెరిపించాలని డిమాండ్ చేశారు. సెజ్ కోసం తక్కువ ధరకు భూములిచ్చి సర్వం కోల్పోయిన రైతుల్ని.. ఇలా పరిశ్రమలను అర్ధాంతరంగా మూసివేసి మరింత అన్యాయం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడు, అభిజిత్ కార్మికులు పాల్గొన్నారు.

30 కిలోల గంజాయి స్వాధీనం



ఆనందపురం కూడలిలో కారులో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

కె.కోటపాడు : ఏజెన్సీ నుంచి గంజాయిని కారులో తరలిస్తుండగా కేరళ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులను ఎ.కోడూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆనందపురం కూడలి వద్ద బుధవారం ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో కారులో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు ప్రయాణించడాన్ని చూసి ఎస్ఐ తనిఖీ చేశారు. దీంతో కారు డిక్కీలో ఉంచిన 30 కిలోల గంజాయిని పోలీసులు గుర్తించారు. నిందితులు కేరళా రాష్ట్రానికి చెందిన మహమ్మద్ షాన్, జిన్సన్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న మూడు సెల్‌ఫోన్‌లు, కారును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

హోంగార్డ్‌పై దాడి చేసిన ముగ్గురి అరెస్ట్

పాయకరావుపేట : తాండవ బ్రిడ్జిపై విధులు నిర్వహిస్తున్న హోంగార్డు రాజుపై ఈ నెల 27న దాడి చేసిన తునికి చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇద్దరిని యలమంచిలి కోర్టుకు, మరో వ్యక్తిని జ్యూవెనల్ కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ జె.పురుషోత్తం తెలిపారు. దాడికి పాల్పడిన మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. నిందితులంతా కారులో వచ్చి దాడికి పాల్పద్దాడన్నారు. కారును కూడా సీజ్ చేశామన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు పలు రైళ్లకు తాత్కాలికంగా మరిన్ని అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- సంబల్‌పూర్–నాందేడ్(20809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), నాందేడ్–సంబల్‌పూర్ (20810) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబరు 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 1–థర్డ్ ఏసీ ఎకానమి, 1–స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- సంబల్‌పూర్–ఈరోడ్ (08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు, ఈరోడ్–సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 8వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 1–థర్డ్ ఏసీ, 1–స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్‌కు నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు నవంబర్ 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు 1–స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు నవంబర్ 3,10,17,24 తేదీల్లో, కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు నవంబరు 4,11,18,25 తేదీల్లో 1–విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.
- విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం (08522/08521) పాసింజర్ స్పెషల్‌కు నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 1–స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.
- పూరీ–యశ్వంత్‌పూర్(22883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు, యశ్వంత్‌పూర్–పూరీ(22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 1–థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం–భువనేశ్వర్(22820) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 5వ తేదీ వరకు, భువనేశ్వర్–విశాఖపట్నం(22819) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 6వ తేదీ వరకు 2–జనరల్ సెకండ్ సిటింగ్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం–కోరాపుట్ (18512) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు, కోరాపుట్–విశాఖపట్నం(18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 2వ తేదీ నుండి 5వ తేదీ వరకు 2–జనరల్ సెకండ్ సిటింగ్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 4వ తేదీ వరకు, బ్రహ్మపూర్–విశాఖపట్నం(18525)ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 30 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు 1–జనరల్ సెకండ్ సిటింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు.

క్లుప్తంగా

పరిహారం కోసం నిరీక్షణ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో దాదాపు రెండు దశాబ్దాల క్రితం పోలవరం కాలువ తవ్వకంలో కోల్పోయిన తన భూమికి నేటికీ పరిహారం అందలేదని బాధితుడు కోన నాగేశ్వరరావు వాపోయారు. తాళ్లపాలెంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సుమారు 1.40 లక్షల మేర పరిహారంగా చెల్లించాలని నిర్ణయించారన్నారు. ఇప్పటి ధరల ప్రకారం అయితే సుమారు రూ.32 లక్షలు ఉంటుందన్నారు. పరిహారం కోసం గతంలో పలు దఫాలు అధికారులకు నివేదించినా పరిహారం ఇవ్వడంలేదన్నారు. ఇప్పటికైనా తనకు రావలసిన పరిహారం ఇప్పించి న్యాయం చేకూర్చాలని నాగేశ్వరరావు కోరారు.

గ్రామ సభలో అర్జీల సమర్పణ



అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు ఎక్కువ సంఖ్యలో రైతులు హాజరై అర్జీలు అందజేశారు. తాళ్లపాలెం రెవెన్యూలో 91, గైతులపాలెంలో 17 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, మండల సర్వేయర్ రామారావు, ఆర్ఐ రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత దంత వైద్య శిబిరం

కశింకోట: కశింకోటలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 1 ఉదయం 10 గంటలకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, కార్యదర్శి కానూరి గోపాలరావు, విశ్రాంత ఎంఈవో నంబా రమణ తెలిపారు. అనకాపల్లి కేర్ దంత వైద్యశాల వైద్యుడు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి సేవలందిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని దంత సమస్యలున్న వారు వినియోగించుకోవాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 1318 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,500	5,100
మొదటి రకం	4,000	5,250
రెండో రకం	3,630	4,230
మూడో రకం	3,200	3,550

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పర్తిసాయి
వెట్టయాన్	: షిర్డిసాయి
బఘీర	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీభాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 467 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 425 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

వరి సాగు.. భలే బాగు

మండలంలో సాగవుతున్న పంటల్లో వరిదే మొదటి స్థానం అని చెప్పొచ్చు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో చక్కటి ఫలసాయం చేతికి వస్తుందని రైతులు, అధికారులు అంచనా వేస్తున్నారు. తెగుళ్లు, చీడపీడలు లేకపోవడం వల్ల పైరు కళకళలాడుతోంది. వర్షంతో పాటు శారదా నది, రంగబోలు జలాశయం నీరు, సాగు నీటి చెరువులు, గెడ్డల నీటితో ఇక్కడి రైతులు సాగు చేస్తున్నారు.

- ఆశాజనకంగా పనులు
- అనుకూలించిన వాతావరణం
- పచ్చదనంతో కళకళలాడుతున్న పొలాలు



వెన్ను వేసే దశలో ఉన్న వరి



కశింకోట వద్ద పొట్ట దశలో ఉన్న వరి పంట

కశింకోట: మండలంలోని ఖరీఫ్ వరి పొలాలు కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం ఏపుగా ఎదిగి పొట్ట, వెను దశలో ఉన్నాయి. అంతంత మాత్రంగానే తెగుళ్లు, దోమ, పురుగులు ఉన్నాయి. మొత్తానికి వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది వరి దిగుబడి ఆశాజనకంగా ఉండగలదని రైతులు, అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వరిదే అగ్రాసనం..

మండలంలో పండించే పంటల్లో వరిదే అగ్రాసనంగా ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ వరి అత్యధికంగా 1360 హెక్టార్లలో వేశారు. ఇది గత ఏడాది కంటే దాదాపు 500 హెక్టార్లు ఎక్కువ. చెరకు సాగు రైతులు వరి సాగు వైపు మొగ్గు చూపడంతో విస్తీర్ణం పెరిగింది. కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, జమాదులపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, ఏఎస్ పేట, తేగాడ, పేరంటాలపాలెం, గొబ్బూరు, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్చెర్ల, జి. భీమవరం, అడ్డాం, సుందరయ్యపేట, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సింగవరం, రామన్నపాలెం, విసన్నపేట తదితర గ్రామాల్లో ఖరీఫ్ వరి ఎక్కువగా సాగు చేస్తున్నారు.

వర్షాధారంతోనే సాగు..

ఎక్కువ శాతం వర్షంతో పాటు శారదా నది, రంగబోలు జలాశయం నీరు, సాగునీటి చెరువులు, గెడ్డల నీటితో సాగు చేస్తున్నారు. కొందరు సదుపాయం ఉన్న వారు బోరు నీటితో సాగు చేస్తున్నారు. దీర్ఘకాలిక రకాలైన ఆర్జీఎల్ 2537, సాంబ మసూరి, స్వల్పకాలిక సోనామసూరి తదితర రకాలు సాగు చేపట్టారు. అయితే నారుమళ్ల దశ, నాట్లు వేసినప్పుడు సెప్టెంబర్ మొదటి వారంలో అధిక వర్షాలు ముంచెత్తి నూతలగుంటపాలెం, ఏనుగుతుని, ఏఎస్ పేట, సోమవరం, బయ్యవరం, వెదురుపర్తి తదితర గ్రామాల్లో అధికారిక లెక్కల ప్రకారం సుమారు 32 హెక్టార్ల మేర నష్టం జరిగింది. రైతులకు పరిహారం అందించారు. ఆ నష్టం తప్ప పంట సాగవుతున్న దాదాపు అన్ని గ్రామాల్లో వాతావరణం అనుకూలించడంతో పంట ఆశాజనకంగా సాగు అవుతోంది. ఎక్కువ చోట్ల ఏపుగా పొలం ఎదిగి ఉంది. పలుచోట్ల పొట్ట దశతో పాటు వెన్నులు ఈనే దశలో ఉంది. వాటిపై అక్కడక్కడ సుడి దోమ, పొడ తెగులు తదితర తెగుళ్లు ఆశించినప్పటికీ మొత్తం మీద పంట ఆశాజనకంగా సాగవుతోంది. ఇకపై కూడా వాతావరణం అనుకూలిస్తే డిసెంబర్ మొదటి వారంలో తేలిక రకం సోనామసూరి, ఇతర రకాల పంట పండి చేతికి రానుంది. మిగిలిన దీర్ఘకాలిక రకాలు డిసెంబర్ చివరి వారం, జనవరి నెలల్లో అందనున్నట్లు రైతులు, అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా వరి సాగు..

మండలంలో ఖరీఫ్ వరి సాగు ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. సుడి దోమ ఆశించినప్పటికీ అది ప్రారంభ దశలోనే ఉండటం వల్ల పెద్దగా నష్టం ఉండదు. నాట్లు వేశాక కాలి బాటలు తీసుకుంటే సుడి దోమ రావడానికి అవకాశం ఉండదు. ఇప్పటికైనా అవకాశం ఉన్న వారు కాలి బాటలు ఏర్పాటు చేసుకుంటే దోమల నుంచి పంటకు రక్షణ లభిస్తుంది. సోనామసూరి వంటి స్వల్పకాలిక రకాలు డిసెంబర్ మొదటి వారంలోను, దీర్ఘకాలిక రకాలు డిసెంబర్ చివరికి గానీ జనవరిలో గానీ చేతికి రానున్నాయి.

– ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యం



పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న అధికారులు

తుమ్మపాల: గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి, స్థానికులు వివక్షకు గురవుతున్నామనే భావం లేకుండా పని చేస్తామని ఎంపీడీవో నరసింగరావు అన్నారు. చింతనిప్పుల అగ్రహారంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయనతో పాటు సివిల్ సప్లై డీటీ జె.కె. తరంగిణి, ఎస్ఐ సత్యనారాయణ, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు పాల్గొన్నారు. కాలనీ వాసులు తెలపిన సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించి, మిగిలినవి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామంలో ఎటువంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. డీవీఎంసీ సభ్యుడు మధుబాబు మాట్లాడుతూ ప్రతినెలా జరిగే పౌర హక్కుల దినోత్సవానికి సంబంధించి అధికారులు రెండు రోజులు ముందుగా తెలియపరచాలన్నారు. ఎస్సీ కాలనీ సమస్యలను కనీసం సచివాలయ సెక్రటరీ కూడా పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు చెబుతున్నారంటే ఈ ప్రాంతంపై ఎంతటి వివక్ష ఉందో అధికారులు గమనించాలన్నారు. హెచ్‌డబ్ల్యువో రామయ్య, సర్పంచ్ పెద్దిశెట్టి గోవిందరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.46లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం



ప్రమీలానగర్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సూరిబాబు, సర్పంచ్ పెంటయ్యనాయుడు

అనకాపల్లి: దశల వారీగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. మండలంలో తుమ్మపాల పంచాయతీ పరిధిలో గవరపేటవీధిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, రూ.26లక్షల నిధులతో ప్రమీలా నగర్ డ్రైనేజీ అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. గాంధీజీ కాలలు కన్న గ్రామ స్వరాజ్యాని నిర్మించనున్నట్లు తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల నుంచి పట్టణ ప్రాంతానికి ప్రజలు రాకపోకలు సాగించేందుకు రహదారులు అభివృద్ధి చేస్తున్నామని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిండం వల్ల గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు తగ్గుముఖం పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి శివకుమారి చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బిందు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన సభలో స్థానికులు పలు సమస్యలు తెలిపి పరిష్కరించాలని కోరారు. తాగడానికి మంచినీరు లేదని, మురుగు కాలువ అంతా ఎస్సీ కాలనీ మీదుగా ఉండటం వల్ల అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్ల ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, దానికి తక్షణం మరమ్మతులు చేపట్టి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, హెచ్‌డబ్ల్యువో నిర్మల, పంచాయతీ కార్యాదర్శి మీరీ జోన్స్, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి



కశింకోటలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

కశింకోట: రోడ్డు భద్రతా నిబంధనలు, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. కశింకోటలో జాతీయ రహదారిపై తీసుకోవలసిన జాగ్రత్తలు, భద్రతా నియమాలపై అవగాహన కలిగిస్తూ మండల ఏపీఎం నడుపురి పార్వతి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనకాపల్లి ప్రాంత కో-ఆర్డినేటర్ ధర్మారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు ఉప్పు సన్యాసిరావు, నూకినాయుడు, నాగేశ్వరరావు, ఉమామహేశ్వరి, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఉచిత గ్యాస్ బండ ఇవ్వాలి




ఐద్వా ఆధ్వర్యంలో మానవహారం నిర్వహిస్తున్న మహిళలు

తుమ్మపాల: ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఉన్న వారికి కాకుండా ప్రతి కుటుంబానికి ఉచితంగా గ్యాస్ బండ ఇవ్వాలని, ముందుగా నగదు వసూలు చేయకుండా ఉచితంగానే అందించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. మాణిక్యం, డి.డి. వరలక్ష్మి డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆడపిల్లలు, చిన్నారుల మీద దాడులు విపరీతంగా జరుగుతున్నాయని, కనుక మద్యం పాలసీని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. లక్ష్మి, నాయకులు జి .సుభాషిని, ఆర్. లక్ష్మి, యు.లోవ, పి. వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి పండగకు వేళాయె

- జోరుగా బాణసంచా విక్రయాలు
- ఆకట్టుకుంటున్న వివిధ ఆకృతుల ప్రమిదలు



మట్టి ప్రమిదలు



నర్సింగరావుపేటలో ఒక ఇంటికి విద్యుత్ వెలుగులు



విద్యుత్ అలంకరణలో ప్రమిదలు



కన్నూరుపాలెంలో బాణసంచా అమ్మకాలు

అనకాపల్లి: పట్టణ, మండలంలో దీపావళి పండగ సందడి మొదలయింది. పలు రకాల ప్రమిదలు మహిళలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అలాంటి వారి కోసం సాధారణ రకంతో పాటు పలు డిజైన్లలో ప్రమిదలు విక్రయిస్తున్నారు. ఇటీవల స్థానికంగా తయారైన ప్రమిదలతో పాటు చెన్నై సహా వివిధ ప్రాంతాల్లో భిన్నంగా ఉండే ప్రమిదలను కొనుగోలు చేసి ఇక్కడ మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఆకర్షణీయమైన ప్రమిదల వైపే అందరూ మొగ్గు చూపుతున్నారు. ఈ పండుగ కసం ప్రత్యేకించి ప్రధాన మార్కెట్లు, ప్రధాన రహదారి కూడళ్లలో ప్రమిదల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో 50 దుకాణాలు ఏర్పాటు చేసి మందు గుండు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్‌లో దీపావళి సామాన్ల ధరలు ఆకాశాన్ని అంటడంతో కొనుగోలుదారుల సంఖ్య తగ్గింది. చిన్నపిల్లలు బాణసంచా ఎక్కువగా ఇష్టపడడంతో తప్పని పరిస్థితుల్లో పెద్దలు మందుగుండు కొనుగోలు చేస్తున్నారు. ప్రమిదలు డజన్ రూ.40 నుంచి 60 వరకు విక్రయిస్తున్నారు. త్వరలో ప్రారంభం కానున్న కార్తీకమాసంలో నాలుగు వారాలు దీపాలు వెలిగించి పూజలు నిర్వహిస్తారు. కనుక మహిళలు ముందు జాగ్రత్తతో కళాత్మకమైన ప్రమిదలు కొంటున్నారు.

కశింకోట: మండలంలో బాణసంచా అమ్మకాలు బుధవారం ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. దీపావళిని పురస్కరించుకుని కశింకోట, తాళ్లపాలెం, కన్నూరుపాలెం, నరసింగబిల్లి తదితర గ్రామాల్లో సుమారు 30 వరకు దుకాణాలు వెలిశాయి. రోడ్ల పక్క షామియానాలు వేసి వాటిలో అమ్మకాలు నిర్వహిస్తున్నారు. వీటి ధరలు కూడా పేలుతుండటంతో కొందరు పెదవి విరుస్తున్నారు. మరికొందరు చేసేది లేక పిల్లల సరదా కోసం ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

అప్రమత్తంగా పండగ చేసుకోవాలి





విధులకు సిద్ధంగా ఉన్న అగ్నిమాపక ఉద్యోగులు, అగ్నిమాపకశాఖ అధికారి నాగేశ్వరరావు

అనకాపల్లి: అగ్నిమాపకశాఖ ఉద్యోగులు ప్రజల ప్రాణాలను రక్షించేందుకు దీపావళి పండగ రోజు కూడా విధుల్లో నిమగ్నమైపోతారు. దీనిపై అగ్నిమాపకశాఖ అధికారి పి.నాగేశ్వరావు మాట్లాడుతూ దీపావళి పండగ కుటుంబంతో చేసుకోవాలని తమకూ ఉంటుందని తెలిపారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం దీపావళి రోజు తప్పనిసరిగా విధులు నిర్వహించాలన్నారు. దీపావళిని సవాల్‌గా తీసుకుని విధులు నిర్వహిస్తామన్నారు. చిన్నారులు మందుగుండు కాల్చే సమయంలో పెద్దలు తప్పనిసరిగా దగ్గర ఉండాలని, కాల్చిన బాణసంచా బకెట్లో నీరు పోసి అందులో ఉంచాలని తెలిపారు. ఉదయం 8 మంది, రాత్రి 8 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తామన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే 101కు ఫోన్ చేసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంటామని తెలిపారు.

ఆటల ద్వారా గణిత పాఠాలు



ఆటల ద్వారా విద్యార్థులకు గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో గణిత శాస్త్రవేత్త శకుంతలాదేవి జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని మూడో రోజు ఆటల ద్వారా గణిత శాస్త్ర భావనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జీవీకే ఆచారి మాట్లాడుతూ ఆటల ద్వారా గణిత భావనలు చూపడం ద్వారా విద్యార్థులకు వత్తిడి లేకుండా గణితం నేర్చుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. గణిత ఉపాధ్యాయులు ఏవీఎస్ మూర్తి, పీవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ బీజ గణితం, రేఖా గణితం భావనలను ఆటల రూపంలో విద్యార్థులకు బోధించినట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కశింకోట: మండలంలో అనుమతి లేకుండా క్రాకర్స్ అమ్మడం గాని, తయారు చేయడం గాని, అనధికారికంగా నిల్వ ఉంచడం గాని నేరమని, అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ అల్లు స్వామినాయుడు హెచ్చరించారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే అందుకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

చిన్నారుల దీపావళి వేడుకలు



తాళ్లపాలెం గాయత్రి స్కూల్లో సంప్రదాయ వేషధారలో విద్యార్థులు

కశింకోట: మండలంలోని పలు పాఠశాలలతో పాటు తాళ్లపాలెంలో ఉన్న గాయత్రి స్కూల్లో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీపావళి ప్రత్యేకతను వివరిస్తూ విద్యార్థులు నాటికను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ వేషధారణతో అలరించారు. టపాసులు కాల్చి దీపావళి సంబరాలు జరిపారు. కరస్పాండెంట్ బి. రాంకుమార్, హెచ్‌ఎం వై. నగేష్, ఐ. అప్పారావు, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పెరిగిన ధరలు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న ఐద్వా నాయకులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని అంటాయని, కూరగాయల ధరలు అదుపులో లేవని ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరలు పెరిగిపోవడంతో ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోయిందని అన్నారు. మరోపక్క ప్రభుత్వ మద్యం పాలసీ వల్ల ఎక్కడ పడితే అక్కడ మద్యం ఏరులై పారుతుందన్నారు. ఉచిత సిలిండర్ల విషయంలో ముందు నగదు చెల్లిస్తే 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుందని చెప్పడం సిగ్గు చేటు అన్నారు. జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.లక్ష్మి, నాయకులు సుభాషిని, ఆర్.లక్ష్మి, యు.లోవ, పి.వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం



అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న స్వాములు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ రైతు సంఘం ఆశ్రమంలో గల అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి 41 రోజుల దీక్షాకాలం నందు ప్రతి బుధవారం స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ గురుస్వాములు మళ్ల నరసింగరావు, కాండ్రేగుల దాసు, కొణతాల పూర్ణచంద్రరావు చెప్పారు. 33 సంవత్సరాలుగా అయ్యప్పస్వామి మాలలు ధరించి పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి గంగాధర్, మళ్ల సురేంద్ర, కొణతాల అప్పలనాయుడు, యల్లపు చక్రవర్తి, కాండ్రేగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల విద్యుత్‌శాఖ సబ్‌స్టేషన్ పరిధిలో నంబర్ 1వ తేదీన 33/11 కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతు నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మపాల, మార్టురు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.